సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 30 । జూన్ । 2024



నేటి నుంచి ఏపీఎల్ 8లో

ఏపీఎల్ మూడో సీజన్‌కు తెరలేచింది. ఆదివారం నుంచి ఏపీఎల్ నిర్వణహకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.



సహస్ర తులసీదళార్చన

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. 8లో



నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం 8లో

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి.

సాగుకు సాయమేదీ ?

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం తన వాటాగా ఇచ్చే రూ.2000 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. అయితే అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు ఇంకా ఆ విషయమై దృష్టి సారించలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

- పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు
- దానిపై ఇంతవరకు దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం
- ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు



పాడేరు మండలం లగిశపల్లిలో అద్దె యంత్రంతో భూమి దుక్కిపనులు చేస్తున్న గిరిజన రైతు

సాక్షి,పాడేరు: గత ఐదేళ్లగా ఏటా ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం రూ.7,500 అందుకుని గిరిజన రైతులు ఉత్సాహంగా వ్యవసాయం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుజేసింది. జిల్లాలో అర్హులైన రైతులకు ఏటా రూ.127 కోట్ల చొప్పున విడుదల చేసింది. ఈ ఆర్థిక సాయంతో జిల్లాలోని గిరిజన రైతులకు ఎంతో మేలు జరిగింది. తిండిగింజల కోసం వ్యవసాయం చేసే గిరిజన రైతులకు రైతు భరోసా వరంలా మారింది.అయితే తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20వేల చొప్పున రైతులకు సాయం చేస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ అంటూ పథకం పేరు మార్చారు తప్ప సాయం అందించడం మరిచిపోయారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో పెట్టుబడి సాయం అందకపోవడంతో గిరిజనులుఇక్కట్లకు గురవుతున్నారు.

అప్పుల కోసం పాట్లు

జిల్లాలో 59 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. కూలిపనులకు వచ్చే తోటి గిరిజనులకు రోజుకు రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ట్రాక్టర్లు, టిల్లర్ల వినియోగిస్తుండడం వల్ల వాటికి చెల్లించేందు నగదు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంత వరకు సాయం అందకపోవడంతో గిరిజనరైతులు పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నారు. కొంత మంది బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెడుతున్నారు.

సాధారణ భూముల్లో సాగుచేస్తున్న రైతులు :	1,69,264
అటవీ భూముల్లో సాగు చేస్తున్న అన్నదాతలు :	56,973

పీఎం కిసాన్ యోజనే దిక్కు : చంద్రబాబు ప్రభుత్వం ఈ వ్యవసాయ సీజన్ అదునుకు మాత్రం రైతులను ఆదుకోలేకపోయింది. పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం గత వారం రూ.2,000 పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమజేసింది. ఈ సొమ్ముతో పాటు అప్పులు చేసి తెచ్చిన నగదును పెటుబడిగా పెట్టి రైతులు సాగు సన్నద్ధమవుతున్నారు.

ప్రభుత్వ సాయమే ఆధారం



వ్యవసాయానికి పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. అయితే ఇంతవరకూ చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా సాయం అందించడంతో పెట్టుబడులకు ఇబ్బందులు ఉండేవి కావు.కేంద్ర ప్రభుత్వం రూ.2వేల సాయమే ఇప్పటికి ఆధారమైంది.వ్యవసాయ పనులకు నగదు అవసరాలు అధికంగా ఉండడంతో ప్రభుత్వ సాయంపై ఆధారపడుతున్నాం.

– రేగం బొంజుబాబు,
గిరిజన రైతు గురిపల్లి,పాడేరు మండలం

అప్పుల కోసం తిరుగుతున్నాం



వ్యవసాయ సీజన్ కావడంతో పనులు చేయించేందుకు రోజువారీ ఆర్థిక అవసరాలు అధికంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు రైతులకు ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. దీంతో అప్పుల కోసం తిరాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.బ్యాంకులు కూడా వ్యవసాయ రుణాలు ఇంకా ఇవ్వలేదు.గత ప్రభుత్వంలో వ్యవసాయానికి సకాలంలో పెట్టుబడి సాయం అందేది. ఈ ఏడాది మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– వంతాల అప్పలనాయుడు,
బస్కి, అరకులోయ మండలం

లాభదాయకమైన పంటల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లిరూరల్: లాభదాయకమైన పంటలను గుర్తించి, వాటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ పంటలపై పరిశోధనలు చేసేందుకు చింతపల్లి పరిశోధన కేంద్రం అన్ని సౌకర్యాలు కలిగి ఉందని తెలిపారు. ప్లాంట్ బ్రీడర్‌గా పనిచేస్తున్న తాను గతంలో వరి,చెరకు,నూనెగింజల పంటలపై పలు పరిశోధనలు చేశానన్నారు. వాటిలో కొన్ని కొత్తరకాలు చింతపల్లి ప్రాంతానికి పరిచయం చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు.రాజ్‌మాతో పాటు వరిలోనూ కొత్తరకాలు విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.అగ్రిటూరిజాన్ని ముందుకు తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రిమ్‌పెక్ విన్యాసాల్లో ఐఎన్ఎస్ శివాలిక్

సింథియా(విశాఖ): ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాదళ విన్యాసం రిమ్ ఆఫ్ ది పసిఫిక్(రిమ్ పెక్)లో పాల్గొనేందుకు భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ శివాలిక్ హవాయిలోని పెరల్ హార్బర్‌కు చేరుకుంది. ఇండియా–జపాన్ మధ్య ద్వైపాక్షిక వ్యాయామం జిమెక్స్–2024 పూర్తయిన తర్వాత ఐఎన్ఎస్ శివాలిక్ పెరల్ హార్బర్‌కు చేరుకున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. హార్బర్ దశలో బహుళ సింపోజియమ్, వ్యాయామ ప్రణాళిక చర్చలు, క్రీడా పోటీలు, పరస్పర డెక్ సందర్శనల్లో శివాలిక్ బృందం పాల్గొనుంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ విన్యాసాలు జూలై 7వ తేదీ వరకు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

లోయర్ సీలేరు కాంప్లెక్స్‌లో ఇంజనీర్ల బదిలీ

మోతుగూడెం: లోయర్ సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పెద్ద ఎత్తున అధికారాల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఏపీ జెన్‌కో నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. లోయర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రాల్లో నూతన చీఫ్ ఇంజినీర్‌గా వాసుదేవ రావును నియమించారు. ఇక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న సీఈ జవహర్ శనివారం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం మోతుగూడెం ఎస్‌ఈ ఓఅండ్ఎంగా పనిచేస్తున్న ఎస్ఎస్ మీరా స్థానంలో నూతన ఎస్‌ఈ ఓఅండ్ఎంగా డి.చిన్న కామేశ్వరరావును నియమించారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఈ (సివిల్)గా పనిచేస్తున్న ప్రశాంత్ కుమార్‌ను విజయవాడకు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఎస్‌ఈ(సివిల్)గా రాంబద్ర రాజును నియమించారు.

కొత్తనీటితో శబరికి జల కళ



కొత్తనీటితో వేగంగా ప్రవహిస్తున్న శబరి నది

వీఆర్‌పురం: సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి దిగువ ప్రాంతం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాగవుతున్న పంటలకు ఈనెల 24వ తేదీ నుంచి అధికారులు నీటిని విడతలవారీగా విడుదల చేయడం ప్రారంభించారు. దీంతో వీఆర్‌పురం, కూనవరం మండలాల మధ్యగా ప్రవహించే శబరినది జలకళను సంతరించుకుంది. నాలుగు నెలలుగా నీరులేక అడుగంటి దర్శనమిచ్చిన నదిలోకి పైనుంచి కొత్తనీరు వచ్చి చేరడంతో నిండుకుండలా కళకళలాడుతోంది. మరో పక్క తుపాను ప్రభావంతో మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో వాగులు,వంకలు పొంగి ప్రవహించి, ఆ నీరంతా శబరిలో కలవడంతో నదిలో నీరు ఎరుపు వర్ణంలోకి మారి మరింత వేగంగా ప్రవహిస్తోంది.

ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ



రాజవొమ్మంగిలో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

రాజవొమ్మంగి: ఎండీయూ వాహనాల ద్వారానే జులై నెలలో రేషన్ సరకుల పంపిణీ యథావిధిగా జరుగుతుందని జిల్లా సివిల్ సప్లయ్స్ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. ఇకపై డిపో డీలర్లద్వారానే రేషన్ సరకులు అందజేయనున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ఈ అంశంపై డీఎం గణేశ్‌కుమార్‌ను వివరణ కోరగా రేషన్ పంపిణీపై ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి ఉత్తర్వులు తమకు రాలేదన్నారు. దీంతో జులై ఒకటవ తేదీ నుంచి పాత పద్ధతిలోనే ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి సరకులు అందజేస్తాయని చెప్పారు.

క్యాన్సర్ మరణాల నియంత్రణే లక్ష్యం

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న పీవో చైతన్య

చింతూరు: క్యాన్సర్, ఇతర వ్యాధుల వల్ల సంభవించే మరణాల నియంత్రణే లక్ష్యంగా వైద్యసిబ్బంది పనిచేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ రకాల క్యాన్సర్లపై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన పీవో మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్, బీపీ, సుగర్, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల మరణాల సంఖ్య 60 శాతంగా ఉందని, దీని నియంత్రణకు క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లోని 30 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించాలని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షల అనంతరం వారికి తగిన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్య నిపుణులు రమణారావు, జ్యోత్స్న, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డు తప్పనిసరి



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ,గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డు తప్పని సరి అని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా హెల్త్ కార్డులు అందజేస్తున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వైద్య సేవలు అందించే విధంగా ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డులను ఫొటోతో పాటు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రతి పాఠశాలలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీన్ చేయించి, శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాలని తెలిపారు. ప్రతి రోజు తాజా ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. జీసీసీ ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరకులతో పాటు పాఠశాలలకు సరఫరా చేసే కోడి మాంసం, కూరగాయలు, ఉపాధ్యాయుల హాజరుపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏటీడబ్ల్యూవోలు కె.సుజాత, రామ తులసి, ప్రసాద్, సూపరింటెండెంట్ బి.కిషోర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్ బాబు, నాగేంద్ర, వెంకట రాజన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్వహణలో లోపాలుంటే కఠిన చర్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- సర్వజన ఆస్పత్రిని సందర్శించి, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర విభాగాల తనిఖీ
- వైద్య సేవలు, ఆహారంపై ఆరా



వార్డులో ఉన్న రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఓపీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

పాడేరు: రోగులకు వైద్యసేవలు కల్పించడంలో, ఆస్పత్రి నిర్వహణలో లోపాలుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. స్థానిక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని ఐసీయూ, డయాలసిస్, జనరల్ వార్డులతో పాటు ఆపరేషన్ థియేటర్లను తనిఖీ చేశారు. ప్రతి వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఇస్తున్న మందులు, భోజనం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య శ్రీ స్టాల్ వద్ద డ్యూటీ చార్ట్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి సత్వర సేవలు అందించాలని, లేనిపోని కారణాలు చెప్పి కేజీహెచ్‌కు రిఫర్ చేయవద్దని ఆదేశించారు. ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులతో ఆయన మాట్లాడి, శిక్షణ వివరాలను అడిగి తెలుసున్నారు.

అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాడేరు జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి 120 పడకల నుంచి 420 పడకలకు పెంచినట్టు చెప్పారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయి హంగులతో నిర్మించారని, మంచి వైద్య సదుపాయాలున్నాయని చెప్పారు. ఆస్పత్రికి మంజూరైన పోస్టుల్లో 30 శాతం మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన ఖాళీలను భర్తీ చేయడానికి వైద్యారోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్‌తో మాట్లాడతానని తెలిపారు. ఆస్పత్రిలో నీటి సమస్య ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కారిస్తానన్నారు. అరకు ఎంపీతో మాట్లాడి ఎంపీ లాడ్స్ నిధుల నుంచి అంబులెన్స్‌లను సమకూరుస్తానని చెప్పారు. ఇకపై తాను తరచూ ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేస్తానన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదని, సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, సర్వజన ఆస్పత్రి సూపరింటెండ్ డాక్టర్ విశ్వమిత్ర, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజనీ, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా మెడికల్ కళాశాల పనులు పూర్తి



పాడేరు మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: రూ.500కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. 35ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల మెయిన్ బ్లాక్,ఆస్పత్రి,నర్సింగ్ బ్లాక్,ఇతర అన్ని విభాగాల పనులను శనివారం ఆయన పరిశీలించారు.పనులు సక్రమంగా జరుగుతుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ముందుగా వైద్యకళాశాల నిర్మాణ మ్యాప్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు.మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు అన్ని విధాల సహకరిస్తామని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని ఇంజినీరింగ్ అధికారులు, ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, ఏపీఎస్ఎంఐడీసీ ఈఈ అచ్చంనాయుడు,తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి,ఎంపీడీవో సాయినవీన్,ఏఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో భాగస్వాములను చేయాలి

- వికలాంగులకు పెంచిన పెన్షన్లతోపాటు ఎరియర్స్ ఇవ్వాలి
- మన్యంలో అర్హులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలి
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో సభ్యుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు



సభలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం

మహారాణిపేట: జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న వివిధ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తమను కూడా భాగస్వాములను చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ సమావేశ మందిరంలో, చైర్‌పర్సన్ చాంబర్‌లో జరిగాయి. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ పెరిగిన పింఛన్లు జూలై ఒకటో తేదీ నుంచి అందిస్తున్నారని, ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలను కూడా భాగస్వాములు చేయాలన్నారు. మండలాల్లో జరిగే కార్యక్రమంలో తమకు ప్రాధాన్యత ఉండాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ దివ్యాంగులకు కూడా పెంచిన పింఛను అరియర్స్‌తో ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇంటి వద్దే పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ ఫలాల పంపిణీలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి సమాచారం లేకుండా ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల పంపిణీ జరిగేదని, అదే తరహా కొనసాగాలని అధికారులను కోరారు. జిల్లాలో లక్షా 64 వేల పైచిలుకు పింఛనుదార్లకు ఈనెల రూ.112 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభారాణి వివరించారు.

మన్యంలో అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వండి

మన్యంలో అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువగా పాడేరు, అరకు ప్రాంతాల్లో ఎంతో మంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు అన్నారు. అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం కూడా అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వడం లేదని చెప్పారు. ఏజెన్సీలో జాబ్ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అయిదు రోజుల్లో అర్హులకు జాబ్ కార్డులు ఇస్తామని అల్లూరి జిల్లా డూమా పీడీ శివయ్య చెప్పారు.

రోడ్లు వేయాలి

మన్యంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు వేయడానికి నిధులు మంజూరైనా ఇంకా వేయకపోవడం అన్యాయమని అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం అన్నారు. సకాలంలో రోడ్లు వేస్తే డోలీ మోత బాధలు తప్పుతాయన్నారు.

మన్యంలో విద్యా ప్రమాణాలు పెంచాలి

మన్యంలో ప్రస్తుతం విద్యా ప్రమాణాలు ఏమి బాగోలేవని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ చదువుకున్న వారికి ఉన్నత విద్యకు అవకాశం రావడం లేదని, వివిధ విషయాలపై వారికి అవగాహన ఉండడం లేదని జెడ్పీటీసీలు గిరిబాబు, కర్రి సత్యం, కాకర దేవి, గంగరాజు అన్నారు.

రైతులతో సమావేశం

గ్రామ, మండల స్థాయిలో రైతులతో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యులు కోరారు. మొక్కల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదురు చూస్తున్నారని, కానీ ఇక్కడ ఇవ్వడం లేదని గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు అన్నారు. నర్సీపట్నం ఏరియాలో మొక్కలు అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ రమణమ్మ అన్నారు. అనేక అంశాల్లో రైతులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ రావడం లేదని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అనకాపల్లి జిల్లా డుమా పీడీ సందీప్ చెప్పారు. పరిశ్రమల శాఖల అధికారుల తీరును ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి ఎండగట్టారు. వైఎస్సార్ బడుగు నివాసం పథకం కింద తాను పరిశ్రమల శాఖ ద్వారా కారు తీసుకున్నానని, నెలలు గడుస్తున్నా తనకు సబ్సిడీ ఇవ్వడం లేదని కాకర దేవి అన్నారు. తాను అనేకసార్లు ఫోన్ చేసినా అధికారుల నుంచి స్పందన లేదన్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని సీఈవో పోలినాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖలు అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు.

పతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు

ఐదేళ్ల లోపు పిల్లలు జిల్లాలో లక్షా 38 వేల మంది ఉన్నారని, వీరికి అతిసార సోకకుండా ఉండేందుకు ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లను ఆశా వర్కర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చైర్‌పర్సన్‌కు తెలిపారు. అతిసార సోకిన పిల్లల కోసం కె.జి.హెచ్‌లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, బెడ్లు ఏర్పాటు చేశామని, ఈ బృందం తక్షణమే స్పందించి వైద్యం అందిస్తారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ చైర్‌పర్సన్‌కు వివరించారు. తొలుత అరకు నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన జెడ్పీటీసీ రేగ మత్స్యలింగంను జెడ్పీ తరపున అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయీ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ ఆగ్రహం

స్థాయీ సంఘాల సమావేశాలకు కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటివి పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహిళల ఆర్థిక ప్రగతికి అధికారులు కృషి చేయాలని, అలాగే మైదాన ప్రాంతాలతోపాటు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ వంటి వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు.

క్లుప్తంగా

షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

చింతూరు: మండలంలోని ఎర్రంపేటలో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం అర్ధ రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు సాయిబాబా విగ్రహానికి ఉన్న కడియంతోపాటు హుండీ, దీపారాధన కుందును అపహరించారు. హుండీలోని సొమ్మును తస్కరించిన దొంగలు ఖాళీ హుండీతోపాటు దీపారాధన కుందును గుడి వెనుకభాగంలో పడేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి మృతదేహం లభ్యం



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చింతూరు: మండలంలోని కొత్తపల్లి వద్ద సీలేరు నదిలో శుక్రవారం రాత్రి గల్లంతైన బాలుడి మృతదేహం శనివారం లభ్యమైంది. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం కొత్తపల్లిలో శుభకార్యం నిమిత్తం వచ్చి సీలేరు నదిలో స్నానాలకు దిగగా సింకు (7) అనే బాలుడు నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి బాలుడి ఆచూకీ కోసం నదిలో గాలించగా ఓ ప్రదేశంలో మృతదేహం లభ్యమైంది.

21 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయిని తరలిస్తున్న ఒకరిని విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విశాఖ రైల్వేస్టేషన్‌లో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ పైడి మనోహర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కోరాపుట్‌కు చెందిన శివపాత్రో బ్యాగులను తనిఖీ చేయగా.. సుమారు 1.06 లక్షల విలువైన 21.3 కిలోల గంజాయిని అందులో గుర్తించారు. విశాఖ స్టేషన్ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో ఆయన తెలిపాడు. గంజాయిని సీజ్ చేసి.. అతన్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

6 జట్లు.. 19 మ్యాచ్‌లు

- నేటి నుంచి ఏపీఎల్ మూడో సీజన్ ప్రారంభం
- పోటీపడనున్న ఆరు జట్లు
- సిద్ధమైన వైఎస్సార్ స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: ముచ్చటగా మూడో ఏపీఎల్ సీజన్‌కు తెరలేచింది. ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నిర్వాహక కమిటీ ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం నుంచి 14 రోజుల పాటు 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆరు జట్ల ఫ్రాంచైజీలతో పాటు జట్ల కెప్టెన్లు పాల్గొని ట్రోఫీని ఆవిష్కరించారు. అన్ని మ్యాచ్‌లకు నగరంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ– వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఈ సీజన్‌లో రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో లీగ్ ప్రారంభం కానుంది. బంగారుపూత పూసిన రోలింగ్ ట్రోఫీని ఆవిష్కరించిన అనంతరం ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఏపీఎల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఆటగాళ్లు ఈ ప్లాట్‌ఫాంను చక్కగా వినియోగించుకున్నప్పుడే ఆ కష్టానికి ఫలితం దక్కుతుందన్నారు. మూడో సీజన్‌లో పాల్గొనే జట్లు సరికొత్త జెర్సీలతో సందడి చేశారు.

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో..

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ ప్రారంభ మ్యాచ్ ఆదివారం రాత్రి 6.30 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వైఎస్సార్ స్టేడియంలో ప్రారంభం కానుంది. లీగ్ మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ తెలుగు, స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌ల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. ఈ పోటీలను రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి ప్రారంభిస్తారు. విశాఖ, విజయవాడ ఎంపీలు శ్రీభరత్, కేశినేని శివనాథ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ హరివెంకటకుమారి, స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, సీపీ శంఖ బ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శరత్‌చంద్రరెడ్డి, గోపీనాథరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు గాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పనిచేస్తోందని గుర్తుచేశారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ వద్ద శనివారం జరిగింది. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అండగా నిలుస్తూ న్యాయ సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ లాంటి వేదికల్లో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీ కాగలిగిన కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, కాలుష్య నివారణ పద్ధతులపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కోర్టు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

శ్రీరామగిరి రామాలయంలో డాగ్ స్క్వాడ్ తనిఖీ

వీఆర్‌పురం: శ్రీరామగిరి సుందర సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో స్వామివారి వాహనాలు చోరీ జరిగిన ప్రదేశాన్ని ఎస్సై కె.నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ డాగ్ స్క్వాడ్ బృందం శనివారం పరిశీలించింది. శ్రీరామనవమి సమయంలో స్వామివారి కల్యాణ సమయంలో మండపానికి తీసుకువెళ్లేందుకు వినియోగించే ఇత్తడి తొడుగులతో రూపొందించిన గరుడ వాహనం, అశ్వ వాహనం, హనుమంత్ వాహనాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. చెక్కరూపంలో తయారు చేసిన ఈ విగ్రహాలకు పై భాగంలో ఇత్తడితో తొడుగులు చేసి అమర్చటం జరిగిందని ఎండోమెంట్ సిబ్బంది సాయిబాబా తెలిపారు. ఈ మూడు విగ్రహాలపై 70 కేజీల వరకు ఇత్తడి ఉంటుందని, వాటి విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఆలయానికి తూర్పు వైపు గేటుకు తాళం వేయకపోవడం, ఆలయ ఆవరణలో వాహనాలు భద్రపరచిన గదికి సైతం తాళాలు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే దుండగులు విగ్రహాలను సులభంగా అపహరించుకుపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్(విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పదవికి మత్స్యలింగం రాజీనామా



జెడ్పీటీసీ రాజీనామా పత్రాన్ని విశాఖ ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మహారాణిపేట: హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకు ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నిక కావడంతో జెడ్పీటీసీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం విశాఖలోని కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను ఆయన కలిశారు. తన రాజీనామా లేఖను ఎమ్మెల్యే మత్స్యలింగం అందజేశారు. తనకు సహకారం అందించిన అధికారులకు ఎమ్మెల్యే మత్స్యలింగం అభినందించారు.

అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంనకు అభినందనలు



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

మహారాణిపేట: అరకు ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ నుంచి విజయం సాధించిన రేగం మత్స్యలింగంనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన శనివారం విశాఖలోని జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయనను పలువురు ప్రశంసించారు.

రెండు రోజుల్లో ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలను రెండు రోజుల్లోగా సమర్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చుల వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి నియోజకవర్గ వ్యయ పరిశీలకుల సంతకాలతో అందజేయాలన్నారు.ఆ వివరాలను సమగ్రంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు పంపుతామని చెప్పారు. వ్యయ పరిశీలకులు నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేక వారి ప్రతినిధులకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిధులు ఎక్కడ నుంచి వచ్చాయి...ఎవరు ఇచ్చారు అనే వివరాలతో ఖర్చులను పక్కగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు పంకజ్‌సింగ్,జేసీ భావన వశిష్ఠ,నోడల్ అధికారి సువర్ణఫణి పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో ఎంఈసీ ఎత్తివేత

- ఆ గ్రూపులో చేరేందుకు అంతగా ఆసక్తి చూపని విద్యార్థులు
- ఇతర గ్రూపుల్లో సీట్లు దొరకని వైనం హెచ్‌ఈసీ గ్రూపు ఏర్పాటు చేయాలని వినతి



కాకరపాడులో గురుకుల జూనియర్ కళాశాల

కొయ్యూరు: మండలంలోని కాకరపాడు గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో గణితం, అర్థశాస్త్రం,వాణిజ్యం(ఎంఈసీ)గ్రూపును ఈ ఏడాది నుంచి ఎత్తివేశారు.ఆ గ్రూపునకు ఇంత వరకు ఎలాంటి అడ్మిషన్లు ఇవ్వలేదు.గడచిన కొన్ని సంవత్సరాల నుంచి ఈ గ్రూపులో చేరేందుకు ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.గ్రూపులో 40 సీట్లు ఉంటే 15 నుంచి 20 మంది మాత్రమే చేరుతున్నారు.దీంతో ఈ ఏడాది ఈ గ్రూపును నిలిపివేశారు. విద్యార్థులు మొదట బైపీసీకి తరువాత ఎంపీసీకి ప్రాధాన్యత ఇస్తున్నారు.వాటి తరువాత హెచ్‌ఈసీ లేదా సీఈసీ గ్రూపులలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే కొయ్యూరు కళాశాలలో ఎంఈసీ తప్ప హెచ్‌ఈసీ గ్రూపు లేదు ఎంఈసీ స్థానంలో హెచ్‌ఈసీ గ్రూపును ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎంఈసీ గ్రూపును ఎత్తివేసిన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఐటీడీఏ పీవోకు సమాచారం ఇచ్చారు.దీనిపై పీవో నిర్ణయం తీసుకోవలసి ఉంది.

ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుపై కలెక్టర్‌కు ప్రతిపాదనలు



తంగేళ్లబందలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో కిల్లో బాలాజీ

ఎంఈవో కిల్లో బాలాజీ

అనంతగిరి: మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ తంగేళ్లబంద గ్రామాన్ని ఎంఈవో కిల్లో బాలాజీ శనివారం సందర్శించారు. ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవించడంపై శుక్రవారం పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకుని, ప్రతిపాదనలు పంపించాలని ఎంఈవోను ఆదేశించారు. దీంతో ఆయన గ్రామానికి వెళ్లి, వాస్తవ పరిస్థితి తెలుసుకున్నారు. గ్రామం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గంగవరం ఎంపీపీ పాఠశాలకు తమ పిల్లలు వెళ్తున్నారని, వర్షాకాలంలో ఉధృతంగా పారుతున్న గెడ్డను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు వాపోయారు. వీరి నుంచి వివరాలు సేకరించిన ఎంఈవో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుపై కలెక్టర్ ప్రతిపాదనలు పంపిస్తామని, అంతవరకు గంగవరం పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని తంగేళ్లబందకు పంపించి, విద్యార్థులకు చదువు చెప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు సమర్ధి నాగేశ్వరరావు, పడాల్, సీఆర్పీ రవికుమార్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

జిప్‌లైన్ కోసం గిరిజన నిరుద్యోగుల వినతి

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల వద్ద ఉన్న జిప్‌లైన్ నిర్వహణకు తమకు అనుమతులు మంజూరు చేయాలని గిరిజన యువకులు బొర్రా సచివాలయంలోని శనివారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిప్‌లైన్‌ను పర్యాటక శాఖ, ప్రైవేటు వ్యక్తి సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. గ్రామ సభ, పీసా అనుమతులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. దీంతో బుధవారం జిప్‌లైన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో జిప్‌లైన్ డెవలప్‌మెంట్ సొసైటీ కోయిటిగుడ పేరుతో తాము నిర్వహిస్తామని అవకాశం కల్పించాలని స్థానిక నిరుద్యోగ గిరిజనులు వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామ సభ తీర్మానం మేరకు జిప్‌లైన్ ద్వారా వచ్చే ఆదాయంలోని 20 శాతం పంచాయతీకి, 12 శాతం పర్యాటకశాఖకు అందజేస్తామని వారు తెలిపారు.



సచివాలయంలోని కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగ గిరిజనులు

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.



పాల్గొన్న ఉభయదాతలు